# మానవుడు

ఫాతిమా, ఫాతిమా ..బెహన్....ఆవోనా, జల్దీ ఆవో-నా...."
ఆ కంఠస్వరం దీనంగా వినవచ్చింది. యెంతో మెల్లిగా విన్పించింది. నిద్ర పట్టక, డన్‌లప్ పరుపుమీద కళ్ళు తెరిచి పడుకొని, తనకు చెరో వైపునా పడుకొన్న ఇద్దరు నలుసులమీదా చెయ్యివేసి, గుండెలను చిక్కబట్టుకుని, ఆలోచనలతో సతమత మవుతున్న ఫాతిమా, వులిక్కి పడి ఆ మాటలు వినవచ్చిన కిటికీవైపుగా చూసింది.

"ఫాతిమా....ఫాతిమా...."

ఫాతిమా భయపడ్డది. నరాలు జివ్వుమన్నభయం. ఆమె పెదిమలు భగవంతుణ్ని గూర్చి అస్పష్టంగా గొణుక్కున్నాయి. ఆమె చేతులు ఇద్దరు బిడ్డల్ని దగ్గరకు లాక్కున్నాయి.

"నేను చెల్లీ! ఇస్మాయిల్‌ను."

ఇస్మాయిలా? ఆమె తన చెవులను నమ్మలేకపోయింది. తన తమ్ముడా! ఇప్పుడు? అర్ధరాత్రి? పైన ఆకాశంలో క్రిందుగా ఓ విమానం పెద్దగా శబ్దంచేస్తూ దూసుకుపోయింది. ఆకాశం నల్లగా వుంది. వీధులన్నీ లైట్లు లేక చీకటిగా భయం భయంగా వున్నాయి. చలిగాలి చెవుల్లోకి దూసుకు వస్తున్నది. సైరన్ చప్పుడెక్కడా లేదు. ఫర్వాలేదు. ప్రమాదం లేదన్నమాట! ఆ వచ్చి వెళ్ళింది పాకిస్తాన్‌వాళ్ళ విమానం కాదన్నమాట!! తన దేశపు విమానమే! సరకుల్నే చేరవేస్తున్నదో, సైనికుల్నే తీసుకు వెళుతున్నదో! ఆ విమానంలో జహంగీర్ వుండినా వుండవచ్చు. భర్తనుగూర్చి తల్చుకోగానే ఫాతిమాకు యెంతో ధైర్యం

వచ్చినట్లనిపించింది. అతను వెళ్ళేటప్పుడు పెద్దపిల్ల అమాయకంగా అడిగింది.

"డాడీ ! వచ్చేటప్పుడు ఏం తీసుకు వస్తావ్" అని.

ఆ పిల్లను జహంగీర్ గుండెలకు హత్తుకుని, ముద్దుపెట్టుకున్నాడు. గాలిలో ఎగరేసి, చేతులమీద పట్టుకున్నాడు. అది రబ్బరు బంతిలా బొద్దుగా వుంటుంది.

"ఓ పారాట్రూపర్ని పట్టుకురానా?"

"కాదు డాడీ ! ఓ పాటన్ టాంకు కావాలి" ఆ పిల్ల పాటన్ టాంకు పేరు రేడియోలో విన్నది. పేపర్లో చూసింది.

"ఓ. కె. డియర్."

జహంగీర్ వెళ్ళిపోయాడు. మూడు రోజులైంది వెళ్ళి. ఎక్కడకు వెళ్లాడో, ఏ విమానం నడుపుతున్నాడో. తన డాడీ, ఎయిర్ ఫోర్స్‌లో వున్నట్లు ఆ పసిదానికేం తెలుసూ ? అనుకొంది ఫాతిమా. ఆమె హృదయం గర్వంతో కొంచెంగా పొంగింది. ఎప్పుడో తన మగడు వస్తాడు. విమానం దూసుకువచ్చినట్టు ఆర్మీ ఎడ్వాన్స్‌అయినట్లు, అంతలో వస్తాడు, అంతలో వెళ్ళిపోతాడు.

"ఫాతిమా.... ప్లీజ్, కమ్‌క్విక్లీ."

ఫాతిమా తడబడుతున్న అడుగుల్తో తొందరగా కిటికీ దగ్గరకు నడిచింది. చీకటిలోకి తొంగి చూసింది. బయట నిలబడ్డ వ్యక్తిని గుర్తుపట్టి, కాతర కంఠంతో, "భయ్యా :- నువ్వా?" అన్నది.

"నన్ను లోపలకు రానీ, తొందరగా .... ఊః" ....మూలుగుతూ, క్రింద పడిపోబోతున్న అన్నను, బలవంతంగా, తొందరగా లోపలకు లాక్కున్నది ఫాతిమా. ఆ వెంటనే కిటికీ తలుపులు రెండూ మూసి వేసింది.

ఇస్మాయిల్ ఏదో చెప్పాలనుకొని, పెదిమలు కదిలించాడు. "ష్. మాట్లాడొద్దు, పిల్లలు లేవొచ్చు." అన్నట్లు సంజ్ఞ చేసింది ఫాతిమా. అతనది గ్రహించినట్లు తలూపాడు. ఆమె లైటు వెయ్యబోయింది.

"వెయ్యొద్దు" అన్నాడు యిస్మాయిల్.

"బ్లాక్ అవుట్ గూడా." అన్నది ఫాతిమా.

ఆమె చప్పుడు కాకుండా అలమారా దగ్గరకు నడిచింది. టార్చి లైట్ తీసుకుంది. "వంటింట్లోకి పోదాం." అన్నది. ఇస్మాయిల్ అతి కష్టంమీద లేచి నిలబడ్డాడు. ఆసరాకు చెయ్యి అందించింది ఫాతిమా. ఆమె బుజాలమీద చేతులువేసి నడిచాడు ఇస్మాయిల్.

వంటింట్లో, డైనింగ్ టేబుల్ ముందున్న కుర్చీలో అన్నను కూచోపెట్టి, ఒకపెద్ద చెంబునిండా మంచినీళ్ళు తెచ్చి, అతని ముందు వుంచింది ఫాతిమా. ఈలోగా ఆ నీళ్ళు తాగివేసి, ప్రాణం పోలి పోగా, కుర్చీ వెనక్కు తలవాల్చి, నీరసంగా ఇస్మాయిల్ అడిగాడు. "ఇక్కడేం ప్రమాదం లేదుగా?"

"ప్రమాదం లేదు సరే; నువ్వెప్పుడిక్కడకు వచ్చావ్? ఎట్లా వచ్చావ్?" ఫాతిమా ఆత్రుతగా అడిగింది.

"ఎట్లాగో వచ్చాను. చావుతప్పి కన్నులొట్టబోయి. అన్నట్లు చుట్టుపక్క లెవరూ సెంట్రీ ల్లేరుగా?"

"వుంటే ఏం?"

"నన్ను వొదిలిపెట్టరు?"

"ఎందుకనీ?"

"బెహన్ ఇంకా గ్రహించలేదా, నే నొక పాకిస్తాన్ పౌరుణ్ణి ఇండియాకు...."

"శత్రువు" అన్నమాట వినకుండా అతని నోరు మూసేసింది ఫాతిమా.

కథా నిలయం
3640
శ్రీకాకుళం

"బెహన్, నే నెక్కడన్నా దాక్కోవాలి."

"ఎక్కడ?"

"ఇక్కడే ఈ యింట్లో, ఎక్కడో నన్ను దాచు, ఆ తర్వాత నా గాయాలకు కట్లుకట్టు."

అతని మాటలకు అడ్డువస్తూ ఫాతిమా అన్నది. "గాయాలకంటే మందేసి నయం చేయొచ్చు, కానీ నిన్నిక్కడ దాచడం మాత్రం...."

"కుదరదంటావ్?" ఇస్మాయిల్ ఆమె వాక్యం పూర్తిచేసి, పేలవంగా నవ్వి," సరే అయితే నన్ను పోలీసుల కప్పగించు." అన్నాడు.

"అన్నయ్యా! .... అన్నయ్యా!".... ఫాతిమా గొంతు గద్గదిక మైంది. ఆమె కళ్ళల్లో నీళ్ళు నిల్చాయి.

"బెహన్, నీకేం భయంలేదు. నే చెప్పినట్లు చెయ్. నా ప్రాణం కాపాడు. నీకే ఆపదా రాకుండా చూసే పూచీ నాది!"

అన్నవేపు ఆర్ద్రంగా చూసింది పాతిమా ఆ మాటలు విని. "నాతో రా" అని అతన్ని మెల్లగా నడిపించుకుంటూ తీసుకువెళ్ళి, పాత సామానులు దాచిపెట్టే గదిలో ప్రవేశపెట్టి, "ఇక్కడికి ఎవరూ రారు." అంటూ అతన్నో మూలకూచోపెట్టి, గబగబా ఆ స్థలమంతా బాగుచేసింది. ఇస్మాయిల్‌ను మెల్లిగా పడుకోపెట్టి అతని మిలటరీ బూట్లను విప్పింది.

"దాహం.... ఆకలి...."

ఆమె లోపలకు పరుగెత్తివెళ్ళి, ఇన్ని తినుబండారాలూ, మంచి నీళ్ళూ తీసుకువచ్చింది. ఆమె వచ్చేసరికి అతను వణికి పోతున్నాడు. అతని చేతులను పట్టుకు చూసింది. వళ్ళు కాలిపోతున్నది.

ఫాతిమా మళ్ళీ ఇంట్లోకి వెళ్ళి ఫస్ట్ ఎయిడ్ బాక్స్, దగ్గర యెప్పుడూ ఉంచుకునే కొన్ని మందు బిళ్ళలూ, కట్లు కట్టడానికి దూదీ

పట్టుకు వచ్చింది. వస్తూ వస్తూ ఇద్దరు పిల్లలవైపూ తొంగి చూసింది. వాళ్ళు, వాళ్ళ స్వప్నలోకంలో హాయిగా వున్నారు. "భగవంతుడా!" అనుకొని, నిట్టూర్చి, అన్ని గాయాలను కడిగి, మందు రాసి, తనకు చేతనైన విధంగా కట్లు కట్టింది. అతనిచేత మందుబిళ్ళలు మింగించింది. అతనికి వంటినిండా రగ్గు కప్పింది. అంతా అయిం తర్వాత అతనివైపు భయం లేదన్నట్టు చూసి, సన్నగా నవ్వి,

"ఊఁ! ఇప్పుడు చెప్పు, అంతా మొదట్నుంచీ. ఏం జరిగింది, యెట్లా వచ్చిందీ?" అన్నది.

,,అలసటగా ఉంది'' అన్నాడు ఇస్మాయిల్ నీరసంగా.

"యెట్లా మరి?" ఫాతిమా నొసలు చిట్లించింది. "నిన్నికక్కణ్నుంచి నేను పంపించేయాలి, లేకపోతే పోలీసుల కప్పగించాలి, యెట్లా?"

ఇస్మాయిల్‌కు ఆ మాటలు విన్పించినట్టే లేదు. అతని కనులు అరమూతలుగా వాలిపోయాయి. అలసట, బాధ అతన్ని బాహిరచైతన్యానికి దూరం చేశాయి. ఫాతిమా, అన్నవేపు కొద్ది క్షణాలు నిశ్చలంగా చూసి, హాల్లోకి తిరిగి వచ్చింది.

*　　　　*　　　　*

ఉదయం ఎనిమిదిగంటలు దాటింది. రాత్రి నిద్ర లేనందువల్ల ఫాతిమాకు తలంతా దిమ్ముగా ఉంది. కళ్ళు మండుతున్నాయి. వంటవాడు తయారుచేసిన 'చా' తాగి, ఆ రోజు వార్తలకోసం పేపరు చేతిలోకి తీసుకొనేసరికి టెలిఫోన్ గణగణ మ్రోగడం మొదలెట్టింది. దగ్గరకు వెళ్ళి రిసీవర్ అందుకుంది.

"హల్లో ఫాతిమా నేనూ మాట్లాడుతోంది, మిసెస్ చక్రవర్తిని"

ఫాతిమా గొంతు సవరించుకుంటూ అన్నది. "గుడ్ మార్నింగ్ మిసెస్...."

మిసెస్ చక్రవర్తి 'గుడ్‌మార్నింగ్' అంటూనే. "ఇది విన్నారా? రాత్రి మనపేటలో ఓ పారాట్రూపరు దిగాట్ట! కాపలా కాస్తున్న హోంగార్డులను తప్పించుకున్నాట్ట. ఇంతవరకూ దొరకలేదట వాడు—

"పుకారులను నమ్మద్దు మిసెస్ చక్రవర్తీ!" ఫాతిమా వాక్యం ఆమెకే ఎబ్బెట్టుగా తోచింది.

"కాదు ఫాతిమా, ఇది పచ్చి నిజం."

"నిజమా? నువ్వేమన్నా అతన్ని చూశావా."

"లేదు."

"మరి నీ కెట్లా తెలుసు?"

"శ్రీమతి జ్యోతి ఫోన్ చేసింది."

ఫాతిమా పెద్దగా నవ్వింది. తేలిగ్గా వూపిరిపీల్చింది. "శ్రీమతి జ్యోతికి మిస్ రాధ చెప్పివుంటుంది. మిస్ రాధకు మిస్టర్ ప్రకాశ్ చెప్పివుంటాడు."

అవతలనుంచి మిసెస్ చక్రవర్తి కంఠస్వరం కంగారు కంగారుగా వినవచ్చింది.

"ఫాతిమా, తొందరపడకు ఫాతిమా నా మాట విను." ఫాతిమా రిసీవర్ క్రింద పెట్టేసింది. పిల్లలకు చేయవలసిన ముస్తాబు చేసి, తీర్చవలసిన అవుసరాలు తీర్చి, వాళ్ళను బడికి పంపేసింది. ఇంతలో మళ్ళీ ఫోను మ్రోగింది.

"ఫాతిమా!- ఉన్నావా ఇంట్లో? నువ్వు—"

"థెరీసా:- ఆ పారాట్రూపర్ సంగతేనా నువ్వు చెప్పదల్చుకొన్నది? నాకు తెల్సు" అన్నది కొంచెం పరుషంగా.

థెరీసా కంఠంలో ఆశ్చర్యం ధ్వనించింది. "పారాట్రూపరెవరు? కొంపతీసి మన ప్రాంతాలకెవడన్నా వచ్చాడేవిటీ?"

ఫాతీమా తన తొందరపాటుకు తనును తాను నిందించుకున్నది. సంబాళించుకొంటూ అన్నది. "అహ, అదికాదు థెరిసా: ఇందాక మిసెస్ చక్రబర్తి అన్నదిలే: అందుకని—సరేగానీ, నువ్వేమిటి చెప్పదల్చు కున్నావ్?"

థెరీసా కంఠంలో ఈసారి చిరుకోపం కన్పించింది. "సాయంత్రం మన లేడీస్ క్లబ్బు మీటింగుకు, నువ్వు సెక్రటరీవి కదా, ఏం ఏర్పాట్లు చేశావో కనుక్కుందామని?"

"జ్ఞాపకం చేసి, మంచిపని చేశావ్, మర్చేపోయాను సుమా."

ఫాతిమాకు, ఇస్మాయిల్ విషయం జ్ఞాపకం వచ్చింది. గబగబా అన్నది 'చూడూ? ఈ వారం. మా యింట్లో జరపాలి క్లబ్బుమీటింగు పోనీ మీయింట్లో అయితే—"

"మీ ఇంట్లో అయితేఏం?" థెరీసా అడగకుండా వుండలేక పోయింది.

"పిల్లలకు—"

"ఆఁ! ఏదో మామూలు జ్వరమే అయివుంటుంది. మీటింగూ అదీ అయ్యేసరికి జ్వరం అంటూ వుంటే తక్కున ఎగిరిపోతుంది. డోన్ట్ వర్రీ"

ఫాతిమా యింకా తన ధోరణి విడవలేదు. మా ఇంట్లో—"

"అవును. అందరూ మీ యింటికే వస్తున్నారు. బీ రెడీ?"

టెలిఫోన్ను తప్పించుకుని, ఫాతిమా అతి కష్టంమీద ఇవతల పడగల్గింది. ఆ సాయంకాలం తన యింట్లో జరగబోయే మహిళా సభ యెంతో ముఖ్యమైంది. యుద్ధరంగంలో పోరాడుతున్న జవాన్లకు ఏమేమి పంపించాలి. వాటిని ఎట్లా సేకరించాలి, అన్న విషయాలమీద తాము నిర్ణయాలు తీసుకోవాలి. ఫాతీమాకు తన పరిస్థితిమీద తనకే అసహ్యం

వేసింది. ఒక ప్రక్కన దేశభక్తి వున్నట్టు, మీటింగులూ అవీ యేర్పాటు చేయడం. మరో ప్రక్కన శత్రుసైనికుల్నే తనయింట్లో దాచిపెట్టడం.... అల్లా తనపట్ల యెంత క్రూరంగా వున్నాడు, అనుకొంది ఫాతిమా. అసలు ఇస్మాయిల్ యిక్కడకు యెందుకు వచ్చాడు? రాకుండానే వుంటే.... అన్నను తల్చుకోగానే ఆమె వూహలు ఇరవై సంవత్సరాలు వెనకకు వెళ్ళాయి. తనూ, వాడూ కవల లనుకునే వాళ్ళు అందరూ! ఒకే విధంగా వుండేవాళ్ళు. ఒకే విధంగా ఆలోచించేవాళ్ళు. చివరకు ఒకే విధంగా దుస్తులు ధరించేవారు. ఒకే మూసలో నుండి తీసిన రెండు బింబాలు తాము. తనకు యౌవనం వచ్చింది. అది తమ ఇద్దర్నీ విడదీసింది. ఒకే ప్రాణంగా వున్నవాళ్ళు. కేవలం స్నేహితులుగా మారిపోవలసి వచ్చింది. తాము మాత్రమే గాదు, తాము పుట్టినదేశం కూడా విడిపోయింది. ఎవరెంత చెప్పినా వినకుండా, వాడు, తన అన్న ఇస్మాయిల్ పాకిస్తాన్ వెళ్ళిపోయాడు. అక్కడే మిలిట్రీ కాలేజీలో చేరాడు. ఆ తర్వాత ఆర్మీలో జాయినయ్యాడు. వాడి బ్రతుకే అట్లా తమకు దూరమైంది. అయితే ఏం? మానసికంగా ఎప్పుడూ తాము దగ్గరగానే వున్నారు. ఉత్తరాలు రాసుకుంటూనే వున్నారు. తన పెళ్ళికి, పెద్ద పిల్ల పుట్టినప్పుడు, చిన్న పిల్ల పుట్టినరోజు పండుగకు వాడు ఆ దేశంనుంచి బహుమతులు పంపించాడు. "ఇన్నేళ్ళకుగాను, ఈ స్థితిలో తాను వాణ్ణి కలుసుకుంది." తన నిస్సహాయ స్థితి చూసి, తనమీద తనకే అసహ్యం వేసింది ఫాతిమాకు. అన్నను ఆదరించలేని, ఆదుకోలేని చెల్లి తాను.... అయ్యో! ఫాతిమా ఇస్మాయిల్ వున్నచోటుకు దాదాపు పరుగెత్తుతున్నట్లుగా వెళ్ళింది. ఇస్మాయిల్ ఇంకా అపస్మారకం స్థితిలోనే ఉన్నాడు. మొహం కొంచెంగా ఉబ్బింది. గాయాలు ఎర్రరంగుకు మారాయి.

"డాక్టరు రాకపోతే, అన్నయ్య బ్రతకడేమో!" అనిపించింది ఫాతిమాకు.

గబగబా వెళ్ళి రింగ్ చేసింది.

"హలో ... హలో.... డాక్టర్ అబ్రహాం వున్నారా?"

అవతల డాక్టర్ అబ్రహాం కంఠ, బొంగురుగా వినిపించింది. హలో .... మిసెస్ జహంగీర్ ....! నేనే- అబ్రహాంని మాట్లాడుతున్నాను. చెప్పండి, ఏవిటి విశేషం?

"డాక్టర్ మీరు అర్జంటుగా రావాలి ...."

"వాట్సది మేటర్?" డాక్టర్ అబ్రహాం ఆత్రుతగా అడిగాడు.

"మా ఇంట్లో వో పారాట్రూ.... సారీ! మై బ్రదర్ ఈజ్ సిక్...."

"పారాట్రూ....అంటున్నావేమిటి మేడమ్ ? కొంపతీసి ఆ పాక్ పారాట్రూపర్ మీ ఇంటికిగాని రాలేదుకదా ....? హి ఈజ్ అవార్ ఎనిమీ, మన శత్రువు. కనిపిస్తే పట్టుకుని గవర్నమెంటుకు అప్పగించేయాలిమనం!",

ఆ మాటలు విని ఆమె మనసు కలుక్కుమంది. గుండె మూగగా రోదించింది. "పారాట్రూపర్ గురించి కాదు డాక్టర్ .... మేరా భయ్యా బహుత్ బీమార్ హై ...."

"వస్తున్నాలేమ్మా! తొందర్లోనే వస్తున్నా.... ఇక్కడున్న పేషంట్సని పంపించేసి ....! అవతల రిసీవర్ పెట్టేసిన చప్పుడు.

తొందర్లోనే వస్తానన్న డాక్టర్ ఎంతసేపటికీ రాలేదు. ఫాతిమాకు ముళ్ళమీద కూర్చున్నట్టుంది. కాలుగాలిన పిల్లిలా అటూయిటూ తిరిగింది. నాలుగయిదుసార్లు వీధి వాకిలి దాకా వెళ్ళి చూసివచ్చింది. ఏవిటో తన పిచ్చి గాని, బయటగేటుదాకా వచ్చినవాడు లోపలికిరాడూ?....

మధ్యలో ఇస్మాయిల్ దగ్గరకువెళ్ళి అతని పక్కనే కూచుని, మన లోకం లేకుండా మూలుగుతున్న అతని నుదురు పట్టుకుచూసి, ఐస్‌బ్యాగ్ పెట్టింది. కొంచెం సేపటికి అతనికి ఆ జ్వరతీవ్రత తగ్గి, "బెహన్!" అంటూ నీ:సంగా పిలిచాడు."

"భయ్యా! ఇక్కడే వున్నా — ఏం కావాలి?"

"పానీ! ..." ఆమె అతనికి మంచినీళ్ళగ్లాసందించింది.

ప్రక్కగదిలో నుంచి ప్రత్యేకవార్తాప్రసారం వినిపిస్తోంది. "లోక్ కాలనీప్రాంతంలో వో పారాట్రూపర్ దిగినట్టు తెలుస్తోంది. అతణ్ని చూసిన వాళ్ళు తక్షణం అతణ్ని పట్టుకుని ప్రభుత్వానికి అప్పగించవలసిందిగా హెచ్చరిస్తున్నాం ఒక విదేశీ సైనికుడికి, మన శత్రువుకు ఏ పరిస్థితుల్లోనూ షెల్టర్ ఇవ్వకూడదని గుర్తుచేస్తున్నాం!"

ఇస్మాయిల్ మెల్లగా ఫాతిమాచేతిని తన చేతిలోకి తీసుకున్నాడు. అతని చెయ్యి వణుకుతోంది. "భయపడకు భయ్యా!" అన్నది ఫాతిమా. ఆమెగొంతూ వణికింది. తనభయం కనిపించకుండా ఆమె తలగడను పట్టుకుంది.

డాక్టర్ అబ్రహాం వచ్చినట్టుగా బయట కారు చప్పుడైంది. "మేడమ్—మేడమ్!" అంటూ అతను స్వతంత్రంగా లోపలికి వచ్చేశాడు. 'ఏడీ మీ పేషెంటు? ఎక్కడ? ఆమె సామాన్లగది దగ్గరకు తనను నడిపించడం చూసి, 'ఇదేమిటి? లంబర్ రూంలో వుంచావెందుకూ మీ బ్రదర్‌ను?" అంటూ ఆశ్చర్యంగా అడిగాడు.

"ఇక్కడైతే ఎవరూ డిస్టర్బ్ చెయ్యరని—" ఆమె తడుముకోని సమాధానం చెప్పింది. "బయటి శబ్దాలు ఇక్కడిదాకా రావుకదా అని!"

డాక్టర్ అబ్రహాం అతన్ని ట్రీట్‌చేస్తూ అన్నాడు. "మీరు ఆర్మీలో పని చేస్తున్నారా? మీ గాయాలు అట్లాగే వున్నాయేలెండి. డిస్ఛార్జ్‌డ్?"

ఆయన రకరకాల ప్రశ్నలు వేస్తున్నాడు. ఆ ప్రశ్నలకు సమాధానాలు చెప్పడం ఫాతిమాకు తలకుమించిన పనైపోతున్నది. అతికీ అతకుండా జవాబులు చెబుతున్నది. డాక్టర్ చేతులు కడుక్కుని బయటకు వెళ్ళబోతూ ఫాతిమాను అవతలకు తీసుకునివెళ్ళి రహస్యంగా అడిగాడు. "అతను నిజంగా నీ తమ్ముడేనా? 'బీ కేర్‌ఫుల్..."

"అల్లా సాక్షిగా!" డాక్టర్ తలపంకించి వెళ్ళిపోయాడు.

సాయంకాలానికి, ఆమె ఇంట్లోనే మహిళామండలి సమావేశం జరిగింది. మిసెస్ చక్రవర్తి, శ్రీమతి జ్యోతి, మిస్ రాధ, థెరీసా, జహనారా బేగం, ఇంకా ఎందరో వచ్చారు. వచ్చినవాళ్ళందరూ తమ కాలనీలో దిగిన పారాట్రూపర్ని గురించే మాట్లాడుకోవడం మొదలెట్టారు

''అతనే నాకు కనిపిస్తేనా ?—ఐ విల్ షూట్ హిమ్! — మిసెస్ చక్రవర్తి అంటోంది.

"మనమీద బాంబులువేసే ఆ పారాట్రూపర్స్ని కండకో కత్తిగా కోయాలి!"

జహనారా అన్నమాటలకు మిగిలినవాళ్ళు అవునవును అంటూ తలూపారు. ఇంతలో లోపలేదో దబ్బునపడ్డ చప్పుడైంది. "వాట్ ఈజ్ ఇట్—ఏవిటది?" అందరూ అటు పరుగెత్తారు. "ఏం లేదు. ఏం లేదు. జస్ట్ ఎ క్యాట్—ఎ ర్యాట్ — క్యాట్ కాట్ ఎ ర్యాట్!"

కిటికీలోనుండి బయటికి ఓ మనిషి దూకి పారిపోయినట్టుగా స్పష్టంగా తెలుస్తోంది. అక్కడ ఓ మనిషి అంతవరకూ వున్నట్టుగా నలిగిన బట్టలు, మిలటరీ బూట్లు, మందు సీసాలు, మూలగా పారాట్రూపర్స్ కిట్ — వాటిని చూడగానే వాళ్ళందరూ కీచుగా అరిచారు. "ఫాతిమా ! యూ ఆర్ ఎ ట్రెయిటర్!! యూ షెల్టర్డ్ ఏ పారాట్రూపర్!" ఫాతిమా భయంభయంగా వాళ్ళవేపు చూస్తోంది. దూరంగా రోడ్డుమీద తన భర్తవస్తున్న జీపు కనిపిస్తోంది. ఆ జీపు ఆ పారాట్రూపర్ని తరిమి పట్టుకోడం కనిపిస్తోంది. ఆమెకు నిజంగా వో విషయం అర్థం కావడంలేదు. ఒకటిగా వున్న దేశం రెండు ముక్కలైంది. ఒక తల్లికడుపున పుట్టిన బిడ్డలు రెండు వర్గాలుగా చీలిపోయారు. అంతమాత్రాన తమ బంధుత్వం తెగిపోవలసిందేనా ?"

ఆ పారాట్రూపర్ని లాక్కునివస్తూ రకరకాలుగా ప్రశ్నిస్తున్నారు.

"చుట్టుపక్కల మనుష్యులు, 'ఫాతిమా నీకు తెలుసా ?"

"తెలీదు...తెలీదు.."

"మరి వాళ్ళింట్లోనే ఎందుకు దాక్కున్నావ్ ?"

ఆవిడ వంటరిగా వుందికాబట్టి, నన్నుచూసి భయపడింది కాబట్టి!"

జహంగీర్ అతని చెంపలమీద లాగి వో దెబ్బ కొట్టాడు. "యూ బాస్టర్డ్ ! నీకు మాఇల్లే దొరికిందా షెల్టర్‌కు ?"

ఫాతిమా ఏదో చెప్పబోయింది కాతర స్వరంతో. "నీకు తెలీదు ఊరుకో! జహంగీర్ కోపంగా అన్నాడు. "ఆడదాని వనిపించుకున్నావ్ ! భయపడిపోయుంటావ్ వెళ్ళు వెళ్ళు లోపలకు !"

ఫాతిమా కళ్ళల్లో నీళ్ళు నిలిచాయి. ఇస్మాయిల్ పౌరుషంగాఅన్నాడు

"వెళ్ళవమ్మా లోపలకు ! నేనెవ్వరో...నీ వెవ్వరో !"

ఫాతిమా అతనివేపు ఒకక్షణం నిశ్చలంగా చూసింది.

మనం ఎవరంటావా పారాట్రూపర్ ?... ఉయ్ ఆర్ ఎనిమీస్!" ఆమె లోపలకు తడబడుతూ వెళ్ళింది. బయటిగుంపు స్టేషను వైపు కదుల్తోంది.